


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఎంత టెక్నో!

**దాదాపు** నాలుగైదేళ్ళగా మన భారతదేశంలో ఒక విప్లవం వచ్చింది. అదేవిటంటే టెక్నాలజీ. పల్లీలు అమ్ముకునే తాత దగ్గరనుండీ, మిరపకాయ బజ్జీలూ పునుగులూ వేసి అమ్ముకునే ముసలమ్మ దాకా టెక్నాలజీ ఒక ప్రభంజనంలా వచ్చి కుదిపేసింది.

అరచేతిలో టెక్నాలజీ! ప్రతివాళ్ళకీ ఓ సెల్‌ఫోన్, ఆ సెల్‌ఫోన్‌లో యూట్యూబ్, వాట్సప్, ఫేస్‌బుక్ రాముడి అమ్ముల పొదిలో బాణాల్లా వేస్తూనే వుంటారు పొద్దున్న లేచిన దగ్గరనుంచి ఫార్వర్డ్ మెసేజెస్.

పక్కింటి పిన్నిగారు గోడమీదనుండి మాట్లాడ్తూ అమ్మతో "సెనగపిండి ఎక్కువ తింటే కాన్సర్ వచ్చి చచ్చిపోతారటండీ" అంటుంది. అమ్మ గాభరాగా "ఎవరు చెప్పారండీ?" అంటే, "వాట్సప్‌లో వచ్చిందండీ. పంపిస్తా చూడండి" అంటుంది. వైరస్‌లా వెంటనే అది అమ్మనుండి మరో పదహారుమందికి వ్యాపిస్తుంది. మా చిన్నప్పుడు సంతోషిమా ఉత్తరాలు వచ్చేవి. ఈ ఉత్తరంలాంటివి ఇంకో పదహారుమందికి ఒక్క రోజులోగా రాసి పంపకపోతే ఒకాయనకి కొడుకు చనిపోయాడు. ఇంకొక ఆవిడకి ఇల్లు తగలడిపోయింది అంటూ దిక్కుమాలిన శాపాలు. సేమ్ టు సేమ్... షేమ్ లేకుండా అలాగే. "మీరు భలే అందమైన స్త్రీ. స్త్రీ ఈ దేశానికి పట్టుగొమ్మ. పచ్చడి జాడీ. ఈ మెసేజ్ ఇంకో పదహారుమందికి పంపిస్తే మీకు శుభం కలుగుతుంది. లేదా విచారిస్తారు." అన్నది కూడా మెసెంజర్ లో వాట్సప్ లో పెడుతుంటారు.

మా ఫ్రెండ్ ఒకావిడ పేపర్లో ఏవొచ్చినా నమ్ముతుంది. "ఆ హీరోయిన్‌కి పెళ్ళికాక ముందే పిల్లాడున్నాడుట. పేపర్లో చదివానండీ" అనేది.

జర్నలిస్టులలో కూడా ఒక రకం శాడిస్టు జర్నలిస్టులంటారు. ఓ హీరోయిన్ తన అక్క కూతుర్ని ఎత్తుకునుంటే ఫోటో తీసి, "జిష ఎత్తుకున్న పాప అక్క కూతురు అంటోంది. నిజంగా అక్క కూతురేనా?" అని ప్రశ్నార్థక చిహ్నం పెడ్తాడు. దాంతో పంకజం ఆంటీ, పక్కింటావిడతో "జిషకి పెళ్ళికాకుండానే ఓ పిల్లాడున్నాడుటండీ. పేపర్లో చూసా." అంటుంది. మా అక్కలాంటిది ఎవరేం చెప్పినా నమ్మడానికి రెడీగా వుంటుంది.

మా అమ్మమ్మ చిన్నప్పుడు బుడగ పగిలిపోతే, మేం నోట్లో పెట్టుకుని చిన్న చిన్న బుడగలు చేస్తుంటే, "బాయిలర్లో వెయ్యండి రంగురంగుల పువ్వులొస్తాయి" అనేది. మా అక్క నమ్మి వేసేది. "నాలుగు ఉప్పురాళ్ళు నోట్లో వేసుకో. సాయంత్రం వానొస్తుంది" అని క్లాస్‌మేట్ చెపితే స్కూల్ తప్పించుకోడానికి బోలెడు ఉప్పు తినేసి, వాంతులు చేసుకుంది.

ఇలా ఇతరుల మాటలకే ఇంత విలువిచ్చేవాళ్ళున్నప్పుడు ఏదైనా ప్రింట్‌లో, అదీ పొద్దుటే మానవుడి కాలకృత్యాలకన్నా ముందే వచ్చే వాట్సప్ మెసేజ్‌లో వస్తే నమ్మరూ?

"నల్లజీలకర్రా, వావిలాకూ, మిరియాలూ, ఎర్రగచ్చాకూ కలిపిన కషాయం రోజూ ఓ స్పూన్ తింటే షుగర్ వ్యాధి మాయం అవుతుంది" అని ఎవడో వాట్సప్‌లో పెట్టి, వందమందికి వాయినంగా పంపుతాడు.

"వావిలాకూ, ఎర్రగచ్చాకూ" అంటే ఏవిటో గూగుల్ చేస్తూ కొంతమంది, ఆ రోజు చెయ్యాల్సిన ముఖ్యమైన పనులు మర్చిపోతారు. వీళ్ళంతా ఇదివరకు నీలివార్తలు వ్యాపించే గుణం వున్న గాలిరాయుళ్ళు. ఇప్పుడు Airtel అనే గాలివార్తలు వ్యాపిస్తూ మనుషుల మనశ్శాంతులు మాయం చేస్తుంటారు.

"2019లో ప్రళయం వస్తుందటండీ" అంటే, "అప్పుడే బ్రహ్మంగారు చెప్పారుగా అనేవాడు ఇంకోడూ. ఇదిగో పులి అంటే అదిగో తోక అనే రకాలు.

ఇంక మన కవిత్వం, పైత్యం, ఎదుటివాడికి నీతులు చెప్పే పనిమీద నిద్రాహారాలు మానేసి ఫార్వర్డ్స్ చేసే సామాజిక సేవకులు కొందరైతే "గుడ్‌మార్నింగ్, గుడ్ ఆఫ్టర్‌నూన్, గుడ్‌నైట్" అంటూ వేలమందికి గుక్క తిప్పుకోకుండా పంపే పనిలో వుండగా ఏదీ పట్టించుకోని మొగుడ్ని వదిలేసి పుట్టింటికెళ్ళిపోతుంది పెళ్ళాం. "తలుపేసుకోండి నేను మిమ్మల్ని వదిలేసి పోతున్నాను" అంటే "గుడ్‌నైట్ బై" అని గులాబీపూలు మెసేజ్ పెట్టాడు కార్యదీక్షారావ్.

ఈ వాట్సప్ పిచ్చాళ్ళ కోసం, మెంటల్ హాస్పిటల్స్‌లో స్పెషల్ వార్డ్స్ కడ్తున్నారని విన్నాను.

ఇదంతా వాట్సప్ పిచ్చి అయితే, ఇంకో విభాగం పోచుకోలు టెక్నాలజీ విభాగంలో ముఖ్యమైనది 'యూ ట్యూబ్'

ప్రవచనాలూ, బాబాలూ చేసే యోగాసనాలూ పక్కనపెడ్తే, "మొగుడ్ని గొడ్డలితో నరికి 14 ఏళ్ళు జైలు శిక్ష అనుభవించి వచ్చిన రాణి మనతో ఏం చెప్తోందో వినండి" అనగానే వేలకొద్దీ ప్రేక్షకులు గంటలో మిలియన్ వ్యూస్. ఏం నేర్చుకుందామనీ?

"భర్త లేనప్పుడు భార్య పక్కింటి కుర్రాడితో ఏం చేస్తోందో చూడండి" అని హెడ్డింగ్. తీరా చూస్తే ఇద్దరూ బ్లాక్ ఫారెస్ట్ కేక్ చెయ్యడం వీడియో వుంటుంది. అసలు హెడ్డింగ్ కి లోపల విషయానికి సంబంధమే ఉండదు.

"ప్రముఖ హీరో భాస్‌తో తిరుగుతున్న ఈ పొలిటీషియన్ కూతుర్ని చూడండి" అన్న వీడియో చూస్తే ఓ సినిమాలో గెస్ట్ వేషం వేసినవాడు ఓ పొలిటికల్ పార్టీలో కార్యకర్త కూతురితో తిరుగుతున్నాడని వార్త. ఆ హీరో ఎవరో ఈ అమ్మాయి ఎవరో వాళ్ళ సందులో వాళ్ళకి కూడా తెలీదు.

"మీ జాతకం అమాంతం మార్చేసి కోటీశ్వరులని చేసే పూజావిధానం. లేదా రంగురాళ్ళు" అని ఏదో వీడియో, లేదా మీ చర్మం అమెరికాలో వాళ్ళలా తెల్లగా అయిపోయే చిట్కా. అని వుంటుంది. తీరా చూస్తే పౌడర్‌లో మైదాపిండి కలిపి రాసుకోమని వుంటుంది.

ఇంక వ్యాపార ప్రకటనలు కాషాయం కట్టి ఓ స్వామీజీ కాపిటలిస్ట్‌లా ఎంత సామ్రాజ్యం స్థాపించి, ఎన్నెన్ని అమ్ముతున్నాడో ఇండియాలో మీకు తెలీనిది కాదు. పౌడర్, పళ్ళపొడి, చారుపొడి, నలుగుపొడి, వల్లకాడు పొడి, ఇంక గోధుమ పిండీ, సెనగపిండికూడా ఆ బాబావే. అందుకే మా స్నేహితురాలి కొడుకు "పతంజలీ సిగరెట్లు ఇంకా వచ్చాయా? లేదా? ఇండియాలో" అని అడిగాడోసారి. వాడి వయసు ఎనిమిదేళ్ళు.

సినిమా తారల కబుర్లు అయితే, ఆవిడ మొగుడు లేచిపోయాడని, ఆవిడ పక్కన ఆయన గుర్రుపట్టి నిద్రపోతుండగానే చెప్తుంటారు. ఆవిడ, ఆయన మొహంలో సెల్‌లో వున్న టార్చ్ వేసి చూస్తుంది.

ఇంక మిగిలినవి ప్రమాదకరమైన యూట్యూబ్ విజ్ఞానం. ఆత్మహత్య ఎలా చేసుకోవాలా? విషం ఎందులో కలిపి పెడితే పోస్ట్ మార్టంలో కనిపించకుండా వుంటుంది? ఏ.టి.ఎమ్‌లో కార్డ్ పెట్టకుండానే ఎలా డబ్బు తియ్యచ్చాలాంటి వీడియోలుంటాయి. ఇలా సొసైటీకి హాని చేసేవే కాకుండా, మరో రకం ప్రమాదకరమైనవి ఏంటంటే,

పెళ్ళి అయిన వారంలో మొగుడు ఆఫీస్‌కి వెళ్ళడానికి తయ్యారవుతుంటే, ఎవడో ఫ్రెండ్ ఫోన్ చేసి "యూ ట్యూబ్‌లో చూసావా మీ ఆవిడా?" అని పెట్టేస్తాడు. తీరా చూస్తే అందులో ఈ కొత్త పెళ్ళికూతురు. "మా అమ్మా నాన్నా మీద భరోసా పెట్టి ఎరేంజ్డ్ మేరేజ్ చేసుకుంటే, నన్ను ఇంపోటెంట్‌కిచ్చి చేసారు" అని చెప్పేస్తూంటుంది పెళ్ళయిన మర్నాడే పాపం ఆలశ్యం కాకుండానూ.

టీవీలో ఒక అమ్మాయి "మా ఆడబిడ్డ మాట విని మా భర్త నన్ను వేధిస్తున్నాడండీ. వారానికి రెండు సినిమాలే చూపిస్తాడు. రాత్రి పదిగంటలకే నిద్రపోతాడు. మా అత్తగారు కూడా తక్కువదికాదు. నన్ను వంట చెయ్యమంటుంది. నేను తొడల్లోకి స్కర్ట్ వేసుకుంటే వద్దు అంటుంది. హూ ఈజ్ షి? నా బట్టల గురించీ, వంట గురించీ మాట్లాడ్డానికి? ఇంక మావగారైతే చెప్పొద్దు. పక్కా విలన్. దేవుడికి దణ్ణం పెట్టాలట. పండగరోజు ఇంట్లోనే భోజనం చెయ్యాలట. అదీ వాళ్ళావిడ వండినది. రోజూ స్విగ్గీ ఏప్‌లో ఫుడ్ తెప్పించుకోకూడదుట. ఇంట్లో ఫ్రెండ్స్ వస్తే నేను మందు కొట్టకూడదుట. ఇన్ని కష్టాలు పెడ్తుంటే ఎలా కాపురం చెయ్యాలండీ?" అని ఓ అమ్మాయి ఏడుస్తూవుంటే, ఏంకర్ జాలిగా మొహం పెట్టి "మూడు నెలలు ఎలా భరించావు సహనా? ఓ మైగాడ్? నేనైతే మొదటి రోజే పరిగెత్తుకొచ్చేసేదాన్ని" అంటుంది.

ఆ తరువాత ఆ అమ్మాయి అత్తనీ, మావనీ, ఆడబిడ్డలనీ, మహిళా సంఘాల వాళ్ళు వాయిస్తారు. "మీకూ ఓ కూతురుంటే ఇలా ఆ బట్టలేసుకోవద్దూ, ఈ తిండి తినొద్దూ, అది తాగొద్దూ అంటారా?" అంటూ. మహిళా సంఘాల వాళ్ళ ఇళ్ళల్లో స్విగ్గీ ఏప్‌లే గతి. ఎందుకంటే వీళ్ళు పొద్దుటే టీ.వీ ఛానెల్స్‌కి వచ్చేస్తారుగా పాపం.

ఇంక ఈ మధ్య ఒక్క ఎగన ప్రముఖ పొలిటీషియన్స్ అందరివీ బయోపిక్స్ వచ్చాయి. ఆ తరువాత యూ ట్యూబ్‌ల్లో వాళ్ళింట్లో పనిమనుషుల్నీ, డ్రైవర్లనీ ఇంటర్వ్యూలు చేసారు పోచుకోలమ్మలూ, పోచుకోలయ్యలూనూ. ఇంక ఆ డ్రైవర్లు "మా సలహాలేకుండా అయ్యగారు అల్లుడికి పదవి కూడా ఇవ్వలేదు. నేను వద్దంటే ఆ రెండో భార్యని కారు దింపేసాడు. నేను ఎంత చెపితే అంత. ఏం తినమంటే అదే తినేవాడు" అంటే, ఆ ఏంకర్ పిల్ల "మీరు దేశానికి ఎంతమంచి చేసారు డ్రైవరంకుల్" అంటూ కళ్ళల్లో గ్లిజరిన్ వేసుకుని కన్నీళ్ళు పెడ్తుంది.

సడెన్‌గా ఏ పనికిమాలినవాడో "నా ఫోన్‌కి ఫలానా పెద్దావిడ పోర్న్ వీడియోస్ పంపింది" అన్నా నిజం ఎంతో ఆలోచించకుండా, అన్ని యూ ట్యూబ్ ఛానెల్స్ వాడినీ ఇంటర్వ్యూలు చేసి పండగ చేసుకుంటాయి. ఇంక ఎక్కడైనా మూక హత్యలూ, ఏక్సిడెంట్లు అయితే, ఆ శవాల మీద పేలాలు ఏరుకున్నట్లు వరసగా శవోత్సవాలు చేస్తాయి ఈ ఛానెల్స్. ఇంకా వూసుపోకపోతే  పాపం ట్రాన్స్ జెండర్స్, జైలుశిక్ష అనుభవించి వచ్చిన వాళ్ళూ మొదలయిన వాళ్ళమీద పైసలు సంపాదించుకుంటారు. ఎవడిల్లు కాలినా వీళ్ళకే పండగ.

ఫేస్‌బుక్ టెక్నాలజీ అయితే ఎంత ముదిరిందంటే, ఒక డాక్టరేట్ తీసుకున్న ఆవిడ నన్ను అనేక విధాలుగా తిడ్తూ మెసెంజర్లో పెట్టడం, ఒక ప్రముఖుడిని సాధించడానికి ఆయన పేరుమీద దొంగ ఫేస్‌బుక్ ఎకౌంట్లు ఓపెన్ చెయ్యడం సైతం చేసింది.

ఏదైనా ముచ్చటగా చేతికొస్తే ముక్కలు చేసేదాకా మానవుడు వూర్కోడు. అందుకే ఫేస్‌బుక్‌లో ప్రేమలూ పెళ్ళిళ్ళూ, బతుకులు బుగ్గైపోవడం అన్నీ వాళ్ళ అప్‌డేట్‌లలో చూసే కన్నవాళ్ళు సైతం తెలుసుకుంటున్నారు. ఈ ఎక్స్‌పోజర్ వల్ల బాగుపడాల్సిందిపోయి

మోసపోయి ఆత్మహత్యలు సైతం చేసుకుంటున్నారు. ఎవడో ఫోటో వాట్సప్‌లో చక్కర్లు కొట్టచ్చు. "సీరియల్ కిల్లర్" అని. ఆ మానవుడు ఎక్కడో ముద్దపప్పు వేసుకుని ముద్దలు తింటూ వుంటాడు. తన ఫోటో సీరియల్ కిల్లర్‌గా చక్కర్లు కొడ్తోందని తెలీక పాపం.


అన్నింటికీ ఆధార్‌కార్డులు లింక్ చేసినట్లు, ఈ ఫేస్ బుక్‌కి కూడా ఆధారో, సోషల్ సెక్యూరిటీ నెంబరో లింక్ చేస్తే నయం ఏమో! మీనాక్షి అని మనతో ముచ్చట్లు చెప్పేది సడెన్‌గా మెసెంజర్లో మన నెంబర్ అడిగి "నేను మదన కామరాజుని మీనాక్షి కాదు" అనచ్చు. జాగ్రత్త ఫ్రెండ్స్. ఫేస్‌బుక్ ఫ్రెండ్ షిప్స్ అన్నీ నిజాలు కావు. కొంతమంది ఫేక్. వాళ్ళవల్ల ప్రమాదాలుంటాయి, మీ స్నేహం ఓ హద్దులో వుంచండి. లేదా మీ ఫోటో ఫేస్ బుక్‌లో షేర్ అవుతూ వుంటుంది.

"ఇప్పటికి వందమందిని చంపి, చట్టం నుండి తప్పించుకున్న హంతకురాలు / హంతకుడు" అని.

ఓ టీచర్ హోం వర్క్ చెయ్యమందని కోపం వచ్చి నిజంగా ఓ కుర్రాడు ఇలా ఆ టీచర్ ఫోటో షేర్ చేసాడుట.

**తస్మాత్ జాగ్రత్త.**

Post your comments




https://www.youtube.com/watch?v=ERaaX_IulS4

